క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయ విలీనంపై పునరాలోచించాలి



మంత్రి సురేఖకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల ఎల్లమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో విలీనం చేయడంపై గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లారు.హైదరాబాద్‌లో శుక్రవారం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే పలు విషయాలపై చర్చించారు. ఈ విషయంపై పునరాలోచించాలని కోరారు.

సొంత భవనాలు ఏర్పాటు చేయాలి



మంత్రిని కలిసిన కమటాల శ్రీనివాస్

జగిత్యాల: జిల్లా కేంద్రంలో రవాణా శాఖకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జిల్లా ఆర్టీఏ సభ్యుడు కమటాల శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల, కోరుట్ల డివిజన్ కేంద్రాల్లో రవాణా శాఖ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ప్రధాన కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉందని, జగిత్యాల, కోరుట్ల కార్యాలయాలకు కంప్యూటర్లు, ఫర్నీచర్ మంజూరు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి ఏర్పాటు చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు.

మంత్రి పొన్నంను కలిసిన నాయకులు

మేడిపల్లి: మాజీ జెడ్పీటీసీ కుందారపు జలందర్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో గాంధీ భవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో పార్టీకి సంబంధించి ప్రస్తుత పరిస్థితులు వారికి వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అవలంబించాల్సిన విది విధానాలను వారితో చర్చించారు.

అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న వసంత

జగిత్యాలరూరల్: అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. మండలం జాబితాపూర్‌లో ఆదె మోహన్‌కు చెందిన పశువుల పాక, ఆవు సజీవ దహనం కాగా గురువారం బాధితుడిని ఆమె పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు గంగారెడ్డి, చిత్తారి శ్రీనివాస్, జలేందర్, స్వామిరెడ్డి, హరీశ్, రాజు, రంజిత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఏర్పాటుకు సర్వే



సర్వే చేస్తున్న మెప్మా అధికారులు

జగిత్యాల: కొత్త మహిళా సంఘాల ఏర్పాటు కోసం అర్హులైన మహిళలను గుర్తిస్తున్నామని మెప్మా ఏవో శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఐదు మున్సిపాలిటిల్లో 63,643 రేషన్‌కార్డులు ఉండగా 58,008 మహిళ సంఘాల్లో సభ్యులున్నారని, రేషన్ కార్డుల మొత్తానికి మిగిలి ఉన్న 5635 మంది మహిళలను గుర్తించి మహిళ సంఘాల ఏర్పాటుకు ఈ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో సర్వే చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంసీ సునీత, టీఎంసీలు శివకుమార్, శ్రీరాంగౌడ్, సీవో సంధ్య పాల్గొన్నారు.

రాయితీపై సేంద్రియ ఎరువులు

కథలాపూర్: మండలంలోని రైతులకు 50 శాతం రాయితీపై సేంద్రియ ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో యోగితా శుక్రవారం తెలిపారు. 360 కిలోల ఎరువుల బ్యాగులు సరఫరా చేశారని, ఆసక్తిగల రైతులు ఏఈవోలను సంప్రదించాలని పేర్కొన్నారు.



మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లో మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. శనివారం స్వామి వారి ఊరేగింపు,ఆదివారం కల్యాణం, బోనాల ఊరేగింపు, మంగళవారం అగ్నిగుండం(నాగవెళ్లి) నిర్వహించనున్నట్లు యాదవ సంఘ సభ్యులు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు,పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు.



స్తంభంపల్లిలో ఎడ్లబండ్ల పోటీలు

వెల్గటూర్ : మండలంలోని స్తంభంపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు అలరించాయి. పోటీల్లో శెకల్ల గ్రామానికి చెందిన వెల్గటూర్ రమేశ్ మొదటి స్థానం, జగదేవుపేటకు చెందిన మెట్పల్లి అజయ్ ఎడ్లు ద్వితీయ స్థానం,షేక్ ఇమ్రాన్, పత్తిపాక పెంటయ్యలకు చెందిన ఎడ్లు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ చింతల రాజయ్య, సభ్యులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు



సేవాలాల్‌కు పూజలు చేస్తున్న గిరిజనులు

రాయికల్: మండలంలోని రాజనగర్‌లోని వీర్యనాయక్ తండాలో శుక్రవారం సంత్ సేవలాల్ మహారాజ్ 286 జయంతి సందర్భంగా ధర్మజాగరణ ప్రముఖ్ సురేందర్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ హిందూ ధర్మం గొప్పదనం గురించి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ధర్మజాగరణ కార్యకర్తలు గుగ్లావత్ జలపతి, శ్రీను, జ్యోత్స్న, మహేశ్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగు

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం భీమన్న ఆలయ ఆవరణలో సంఘమిత్ర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతగా ఆర్టీబీ, రన్నర్‌గా సూర్య జట్లు నిలువగా వీరికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భీమన్న జాతర సందర్భంగా సంఘమిత్ర యూత్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బాధితుడిని ఆదుకుంటాం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన ఆదె మోహన్‌కు చెందిన పశువుల పాక, పశుగ్రాసం అగ్నిప్రమాదంలో దగ్ధం కాగా, శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మోహన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పుల్వామా అమర జవాన్లకు నివాళి



కథలాపూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

కథలాపూర్: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో పుల్వామా సంఘటనలో అమరులైన సైనికులకు శుక్రవారం నివాళి అర్పించారు. బస్టాండ్ కూడలి వద్ద సైనికుల చిత్రపటాలను ఏర్పాటు చేసి కొవ్వొత్తులు వెలగించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, వెంకటేశ్వర్‌రావు, మహేశ్, రవీందర్‌రెడ్డి,అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు శుక్రవారం రాయికల్ పట్టణ యువత ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్‌లో మౌనం పాటించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అమరులైన జవాన్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ యువకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతోపాటు, గొర్రెపల్లిలో అమర జవాన్లకు బీజేపీ నాయకులు, వీహెచ్‌పీ నాయకులు నివాళి అర్పించారు.

చర్మవ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న ఉప వైద్యాధికారి

పెగడపల్లి: చర్మవ్యాధల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి, చర్మవ్యాధుల నిపుణులు శ్రీనివాస్ సూచించారు. పెగడపల్లి పీహెచ్‌సీని శుక్రవారం ఆయన సందర్శించారు. పలు రికార్డులు, మందులు, ల్యాబ్‌ను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాల సిబ్బందికి సూచించారు. అసంక్రమిత వ్యాధులైన క్యాన్సర్, మధుమేహం, బీపీ వ్యాధులపై సర్వే చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 12 మంది చర్మవ్యాధిగ్రస్తులను పరిక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాస్, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా శాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సబ్ పోస్ట్‌మాస్టర్

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ పోస్టు మాస్టర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో గాంధీ కూడలి వద్ద తపాలా శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ బీమా పథకాలపై అవగాహన కల్పించారు. తపాలశాఖ ప్రత్యేకంగా టాటా జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.399, రూ.299 బీమా పాలసీలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొల్లపల్లి రామాగౌడ్, మాజీ ఉపసర్పంచ్ అల్లూరి మహేష్‌రెడ్డి, మెల్ ఒవర్సిర్ శ్రీకాంత్, తపాల బ్రాంచి పోస్టుమాస్టర్లు రాజేశం, రాము, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ అధికారులు, సిబ్బంది నిరసన

మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల బ్రాంచి పోస్టాఫీసులతో పాటు ముత్యంపేట సబ్ పోస్టాఫీసు వద్ద శుక్రవారం భోజనవిరామ సమయంలో తపాలా(పోస్టల్) శాఖను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సబ్ పోస్టుమాస్టర్, బ్రాంచి పోస్టు మాస్టర్లు, సిబ్బంది నిరసన తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

గొల్లపల్లి: మండలంలోని వెన్గుమట్లలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది పాల్గొనగా 28 మందికి కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో లయన్ రాజేశ్వర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ బొమ్మెన కుమార్, కార్యదర్శి నాయిని నరహరి, రేకుర్తి కంటి ఆస్పత్రి టెక్నీషియన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

మాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

మెట్‌పల్లి: మాలల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా మాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని మాల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను చేపట్టవద్దంటూ శుక్రవారం మండల పరిషత్ పార్కులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వర్గీకరణతో మాలలకు నష్టం జరుగుతోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవద్దన్నారు. కార్యక్రమంలో దాసరి బాబు, పొట్ట రాజేశ్వర్, గోరుమంతుల మారుతి, రాసమల్ల సురేష్, కారం రాజయ్య, సాగర్ తదితరులున్నారు.

గొర్రెలకు టీకాలు వేయించాలి

జగిత్యాల: గొర్రెలకు షీప్‌పాక్స్ (అమ్మతల్లి) టీకాలు వేయించాలని వెటర్నరీ అధికారి కందుకూరి పూర్ణచందర్ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలోని 587 గొర్రెలకు అమ్మతల్లి టీకాలు వేశారు. కార్యక్రమంలో సబార్డినేట్ అనిత, యాదవులు పాల్గొన్నారు.

మేడిపల్లి మండల సోషల్ మీడియా ఇన్‌చార్జిగా ప్రేంసాగర్

మేడిపల్లి: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మేడిపల్లి మండల సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కొండాపూర్ గ్రామానికి చెందిన దప్పు ప్రేంసాగర్‌ను నియమించినట్లు మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, మేడిపల్లి మాజీ సర్పంచ్ రాజగౌడ్, తదితరులు ఎల్లో న్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన ఇద్దరు నాటుసారా విక్రయిస్తుంటే పట్టుకుని తహసీల్దార్ వినోద్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ వినోద్ రాథోడ్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన కుక్క దువ్వ గంగాధర్, పెడిమెల్లి గణేశ్ అనే ఇద్దరు నాటుసారా విక్రయిస్తూ పట్టుబడ్డారు. వీరిని తహసీల్దార్ వినోద్ ఎదుట బైండోవర్ చేయగా.. వ్యక్తిగత పూచికత్తుపై వదిలేశారని తెలిపారు. కార్యక్రమంలో అబ్కారీశాఖ అధికారులు ఎం.డీ వహీద్, రామచందర్, రవి తదితరులు ఉన్నారు.

క్షేత్ర పర్యటనతో విద్యార్థులకు మేలు



కార్యాలయ పనితీరును పరిశీలిస్తున్న విద్యార్థులు

జగిత్యాల: విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటనతో నైపుణ్యం పెరుగుతుందని ఆరెపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రావణి అన్నారు. శుక్రవారం కొడిమ్యాల మండలం ఆరెపల్లి పాఠశాల విద్యార్థులు జిల్లాలోని పలు తహసీల్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తేజశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి తరఫున ప్రచారం

పెగడపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి చిన్నమల్లై అంజిరెడ్డిని గెలిపించాలని ధర్మపురి నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జీలు డాక్టర్ జ్యోతిరెడ్డి, భూమన్న కోరారు. పెగడపల్లి మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, గ్రాడ్యుయేట్లను కలిసి వారు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, నిరుద్యోగ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. నాయకులు కొమ్ము రాంబాబు, పిల్లి శ్రీనివాస్, పల్లె మెహన్‌రెడ్డి, సాయి కృష్ణ, అంజి, సతీశ్, గట్టయ్య, రాజు, మల్లేశం, నిఖిల్, హరీశ్, లతీశ్, లింగమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ధర్మపురి: మండలంలోని మగ్గిడి గురుకుల పాఠశాలకు చెందిన హర్షవర్ధన్ మెట్‌పెల్లిలో ఇటీవల జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభను చాటి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఈ నెల 18న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని శుక్రవారం ప్రిన్సిపాల్ రమేశ్, పీఈటీలు కల్పన, సంతోష్ అభినందించారు.

చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి

ధర్మపురి: ధర్మపురి సొసైటీ సభ్యుడు తిరుమందాస్ సత్యనారాయణ గతేడాది ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబానికి మంజూరైన రూ.లక్ష ఇన్సూరెన్స్ చెక్కును శుక్రవారం డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మృతుడి భార్య శోభారాణికి అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎల్లాగౌడ్, కేడీసీసీ బ్యాంకు సీఈవో రాజేష్, ఫీల్డు అసిస్టెంట్ ప్రవీణ్ పాల్గొన్నారు.

డీఎస్పీకి అభినందన

జగిత్యాలక్రైం: జగిత్యాల డీఎస్పీగా రఘుచందర్ బాధ్యతలు స్వీకరించి సంవత్సరం పూర్తవడంతో శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది డీఎస్పీ రఘుచందర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ఎండుతున్న మొక్కలు



కోరుట్ల రూరల్: పట్టణ శివారులోని సంగెం రోడ్డులో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలో నాటిన కొబ్బరి మొక్కలు నీళ్లు లేక ఎండి పోతున్నాయి. మొక్కలు నాటినప్పటికీ ఇంత వరకూ నీళ్లు పట్టడం లేదు. మొక్కలకు నీళ్లు పట్టి సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: బట్టు తిరుపతి , మున్సిపల్ కమిషనర్, కోరుట్ల, సెల్ నంబర్: 9849905880

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: పట్టభద్రుల స్థానానికి పోటీచేస్తున్న నరేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలిపించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఊట్కూరి నరేందర్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ప్రభుత్వ విప్ అడ్లూరి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. నిధులు, నీళ్లు, నియామకాలే లక్ష్యంగా ఏర్పడ్డ రాష్ట్రంలో దశాబ్దకాలపుబీఆర్ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ 55వేల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. సమావేశంలో నాయకులు కొత్త మోహన్, తాటిపర్తి విజయలక్ష్మి, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురిలోని బ్రాహ్మణ సంఘంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రచారం చేశారు. నరేందర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

• ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



కోరుట్లలో మాట్లాడుతున్న నరేందర్ రెడ్డి

కోరుట్ల:/మెట్‌పల్లి: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటుందని పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఊట్నూరి నరేందర్ రెడ్డి అన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై పది నెలల లోపే 56 వేల ఉద్యోగాలు కల్పించిందన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, కోరుట్ల పట్టణ, మండల అధ్యక్షులు గంగాధర్ గౌడ్, కొంతం రాజం, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు మచ్చ కవిత, నాయకులు అన్నం అనిల్, సీపీఐ నాయకుడు చెన్నా విశ్వనాథం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

చికిత్స పొందుతూ మహిళ మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన భారతపు జల (43) అనే మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. తిప్పన్నపేటకు చెందిన భారతపు జల, ఆమె భర్త శ్రీనివాస్ జనవరి 28న సాయంత్రం అప్పుల బాధతో భార్యభర్తలిద్దరూ పురుగుల మందు తాగారు. వారి కుమారుడు గణేశ్ ఆస్పత్రిలో చేర్పించాడు. చికిత్స పొందుతూ జల శుక్రవారం ఉదయం మృతిచెందింది. మృతురాలి కుమారుడు గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

మద్యం తాగిన వ్యక్తికి జైలు

జగిత్యాలక్రైం: గొల్లపల్లి మండలం చిల్వ కోడూర్‌లో గొల్లపెల్లి ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో గతేడాది డిసెంబర్ 28న వాహనాల తనిఖీ చేపట్టారు. లక్ష్మీపూర్‌కు చెందిన ఆకుల తిరుపతి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితున్ని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా, స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి కరుణాకర్ నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కడెం తిరుమలేశ్ (37) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. తిరుమలేశ్ ఈనెల 11న తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తన ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలయై దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

పంచాంగ పుస్తకాలు ఆవిష్కరణ



పంచాంగ పుస్తకాలు ఆవిష్కరిస్తున్న పండితులు

కోరుట్ల: పంచాంగ గణితం కంటే సనాతనమైన గణితం మరొకటి లేదని దైవజ్ఞ శిరోమణి సిద్ధాంత భాస్కర బ్రహ్మశ్రీ ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి అన్నారు. జ్యోతిష్య పండితుడు బ్రహ్మశ్రీ శ్యామ్ సుందర్ శర్మ సిద్ధాంతి గణించిన విశ్వావసు నామ సంవత్సర పంచాంగ పుస్తకాన్ని పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో గురువారం రాత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి గౌరిభట్ల దత్తాత్రేయ శర్మ, బ్రాహ్మణ సేవా పరిషత్ గౌరవ అధ్యక్షుడు సేనాపతి ప్రవీణ్ కుమార్ ఆచార్య, ప్రధాన కార్యదర్శి కలకుంట్ల నితిన్, స్వరాజ్, రామకృష్ణా శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.